క్లుప్తంగా

వంద మందికి వైద్య పరీక్షలు



తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యులు

సరుబుజ్జిలి: ఆరోగ్య సూత్రాలు పాటిస్తే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు అరికట్ట వచ్చునని కిల్లి వెంకటనర్సింగరావు, శశికళమ్మ సేవా సంస్థ అధ్యక్షుడు కిల్లి హరికృష్ణ అన్నారు. హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రి (విశాఖ) ఆధ్వర్యంలో పురుషోత్తపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కేన్సర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. క్యాన్సర్ లక్షణాలు కనిపించిన వెంటనే తగిన చికిత్సలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ సందర్భంగా సుమారు 100 మందికి తనిఖీలు చేసి మందులు అందించారు. అవసరమైన వారికి ఆస్పత్రికి రిఫర్ చేశారు. వైద్యులు తమ్మినేని మోహన్‌రావు, బగాన కార్తికేశ్వరరావు, స్థానిక యువత శ్రీరామచంద్ర, శ్రీమనారాయణ, దాలినాయుడు, పురుషోత్తమరావు, రాజేంద్ర, ఆస్పత్రి అసిస్టెంట్ మార్కెట్ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి



హెచ్‌సీ మహదేవన్ (ఫైల్)

పోలాకి: స్థానిక పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ మహదేవన్ (52) శనివారం రాత్రి శ్రీకాకుళంలోని ఆయన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. ఎఫ్‌ఎస్‌ఎల్ డ్యూటీపై హైదరాబాద్ వెళ్లిన మహదేవన్ అదే రాత్రి శ్రీకాకుళం చేరుకున్నారు. ఆదివారం ఉదయం స్టేషన్‌లో రిపోర్ట్ చేయాల్సి ఉంది. హెచ్‌సీ మృతి చెందిన విషయం తెలుసుకున్న సీఐ రాము, ఎస్‌ఐ నర్సింహమూర్తి, సిబ్బంది శ్రీకాకుళం వెళ్లారు. అంత్యక్రియల నిమిత్తం పోలీస్ ఫండ్‌ను కుటుంబ సభ్యులకు అందించారు.

సిరిమాను ఉత్సవాలు ప్రారంభం



సిరిమానుకు పసుపు రాస్తున్న మహిళలు

నరసన్నపేట: సత్యవరంలోని పాదాలమ్మ తల్లి సిరిమాను మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. శాస్త్రోక్తంగా దేవరను తీసుకువచ్చి, సిరిమానుకు పూజలు చేపట్టారు. దేవరకు, సిరిమానుకు మహిళలు ముర్రాటలు సమర్పించారు. ఎంపీపీ ఆరంగి మురళి, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు పంపిణీ చేస్తున్న సార్డ్స్ డైరెక్టర్ రాజారావు

సరుబుజ్జిలి: మొక్కలు నాటి సంరక్షించినప్పుడే పర్యావరణం పరిరక్షించబడుతుందని సాయి రూరల్ డెవప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ (సార్డ్స్) డైరెక్టర్ తాడేల రాజారావు తెలిపారు. సత్యసాయి సేవా సంస్థల తరఫున శ్రీకాకుళం గ్రామ ప్రేమతరువు కన్వీనర్ బోయిన చంద్రమౌళికి బాదం, మారేడు, జామ, కానుగ తదితర మొక్కలను ఆదివారం ఉచితంగా అందించారు. మొక్కలను రక్షించేలా సత్యసాయి భక్తులు పనిచేస్తున్నారని అన్నారు. గుడ్‌వే ఫౌండేషన్ అధ్యక్షురాలు బూరగాపు ఉమామహేశ్వరి, సత్యా సాయి సేవా సంస్థల జోనల్ కన్వీనర్ మునగవలస రవీంద్రబాబు, నాగభూషణరావు, జ్యోతికుమారి పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



బదిలీ ఎస్‌ఐని సన్మానిస్తున్న సీఐ, ఎస్‌ఐ, సిబ్బంది

సారవకోట: ప్రజలకు అందించిన సేవలే గుర్తింపునిస్తాయని నరసన్నపేట సీఐ రాము అన్నారు. సారవకోటలో ఎస్‌ఐగా పనిచేసి బదిలీపై నౌపడ వెళ్లిన లావణ్యను ఆదివారం సన్మానించారు. సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతలు కాపాడటంలో పోలీసులు పాత్ర గొప్పదన్నారు. సారవకోట ఎస్‌ఐ అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి జామి జాతర

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామంలో ఉన్న ఎల్లమ్మ తల్లి ఆలయంలో జామి జాతర సోమవారం నుంచి ప్రారంభం కానుందని గ్రామస్తులు ఆదివారం తెలిపారు. మార్చి 1వ తేదీ వరకు అమ్మవారికి ప్రీతికరమైన వంటలను పెట్టి పూజలు, అగ్ని గుండం, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు.

పేదలకు స్వగృహ యోగం

- ఉగాది నాటికి సామూహిక గృహప్రవేశాలకు ఏర్పాట్లు
- ఆనందంగా ఇళ్లను ముస్తాబు చేసుకుంటున్న లబ్ధిదారులు
- నరసన్నపేట, ఆమదాలవలసల్లో 9 వేల ఇళ్ల నిర్మాణమే లక్ష్యం



నరసన్నపేట మండలం ఉర్లాంలో నిర్మాణం పూర్తయిన జగనన్న ఇల్లు



జమ్ము పంచాయతీ గడ్డెయ్యపేట లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

నరసన్నపేట: ప్రతి పేదవాడి సొంతింటి కలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెరవేర్చుతుంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీల నిర్మాణం చేపడుతోంది. ఉగాది రోజున సామూహిక గృహప్రవేశాలు చేయాలని సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇదివరకే గృహనిర్మాణశాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. నరసన్నపేట, ఆమదాలవలస నియోజకవర్గాల్లో 9 వేల గృహ నిర్మాణాలు పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆమేరకు గృహప్రవేశాలు చేసేందుకు అధికారులు, లబ్ధిదారులు సిద్ధవుతున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలోని నరసన్నపేట, పోలాకి, జలుమూరు మండలాల్లో 6829 ఇళ్లు మంజూరయ్యాయి. తాజా లెక్కల ప్రకారం 2877 ఇళ్లు పూర్తయ్యాయి. ఆమదాలవలస నియోజకవర్గంలో 8978 ఇళ్లు మంజూరు కాగా 3015 ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేశారు. నరసన్నపట మండలం జమ్ము పంచాయతీ పరిధిలోని 9 లేఅవుట్లో 990 ఇళ్లు నిర్మిస్తున్నారు. వీటిని నరసన్నపేట పంచాయతీ పరిధిలోని లబ్ధిదారులకు మంజూరు చేశారు. ఇప్పటికే విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఇళ్లు పూర్తి చేసిన లబ్ధిదారులకు ఉచితంగా మీటర్లు కూడా ఇస్తున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలోని సారవకోటతోపాటు పాతపట్నం నియోజకవర్గానికి మొదటి విడతలో ఇళ్లు మంజూరు చేయలేదు.

ప్రభుత్వం తోడ్పాటు..

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతీ ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు కేటాయిస్తున్నాయి. పొదుపు సంఘాల నుంచి రూ. 35 వేలు రుణంగా అందుతుంది. నరసన్నపేట మండలం జమ్ము పంచాయతీ లేఅవుట్‌లో రోడ్లు, మంచినీరు, విద్యుత్ సౌకర్యం కోసం రూ.3 కోట్లు పైగా ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తుంది. అన్నిచోట్లా సదుపాయాలు కల్పిస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాలు ఇలా..

మండలం	మంజూరైన ఇళ్లు	బీబీఎల్	బీఎల్	ఆర్‌ఎల్	ఆర్‌సీ	పూర్తయినవి
పోలాకి	2502	622	251	104	177	969
జలుమూరు	1708	250	161	123	172	951
నరసన్నపేట	2619	673	544	162	198	957
ఆమదాలవలస	1412	436	126	53	83	697
పొందూరు	1859	738	120	80	173	665
సరుబుజ్జిలి	1163	283	120	41	141	540
బూర్జ	802	757	92	98	192	599
ఆమదాలవలస అర్బన్	2742	1840	208	71	50	514

చురుగ్గా ఇళ్ల నిర్మాణాలు

ఉగాది నాటికి సామూహిక గృహప్రవేశాలు చేసేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నాం. లబ్ధిదారులు కూడా సహకరిస్తున్నారు. ఇంతవరకు పనులు ప్రారంభించని లబ్ధిదారుల్లో చైతన్యం కల్పించి, పనులు ప్రారంభించేలా చేస్తున్నాం. అనుకున్న లక్ష్యాలు దిశగా పనులు చేస్తున్నాం.

– కె.అప్పారావు, గృహనిర్మాణ శాఖ డీఈ, నరసన్నపేట

ఇంటిని నిర్మించుకున్నాం..



చాలా కాలంగా సొంతిల్లు లేదు. టీడీపీ హయాంలో ప్రయత్నించాం. ఫలితం లేక పోయింది. చివరికి జగనన్న దయతో ఓ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. ఉగాదికి గృహ ప్రవేశం చేస్తాం. చాలా ఆనందంగా ఉంది.

– నబ్బ పార్వతి, ముషిడిగట్టు, నరసన్నపేట మండలం

వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడిగా వంశీకృష్ణ



వంశీకృష్ణను అభినందిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పార్టీ నాయకులు

సారవకోట: వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడిగా వరుదు వంశీకృష్ణను పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆదివారం ప్రకటించారు. అడ్డపనసలో జరిగిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఆయన పేరు ప్రకటించి అభినందించారు.

మండలంలో పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేస్తానని వంశీకృష్ణ తెలిపారు. వైస్ ఎంపీపీలు గుణుపురం రామారావు, ఎడ్ల అసిరయ్య, పార్టీ నాయకులు నక్క తులసీదాస్, గెల్లంకి వెంకటరావు, రావాడ శ్రీనివాసరావు, కొండాల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తమ్మినేని చిరంజీవినాగ్, పార్టీ నాయకులు

ఆమదాలవలస: త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీఎం వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన పార్టీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించడమే లక్ష్యంగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ పిలుపునిచ్చారు. ఆమదాలవస పట్టణంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఉత్తరాంధ్ర గొంతు బలంగా వినిపించాలన్నారు. ఈ ప్రాంతం సమస్యలపై మండలిలో చర్చ జరగాలంటే సుధాకర్ వంటి వ్యక్తుల సేవలు అవసరమన్నారు. వార్డు సచివాలయ కన్వీనర్ ఎ.ఉమామహేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ బి.నారాయణరావు, పార్టీ నాయకులు డి.శ్యామలరావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి రెండో విడత ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

బూర్జ: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మార్చి 3 నుంచి 6వ తేదీ వరకు రెండో విడత ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ గురుకులం విద్యాలయం ప్రిన్సిపాల్ నూక రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థులకు ఈ విద్యాలయంలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రాక్టికల్స్ పరీక్షలకు సర్వం సిద్ధం చేన్నామన్నారు. 102 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు.

రక్తదానం.. ప్రాణదానం



సరుబుజ్జిలి: రక్తదానం శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ కృష్ణప్రసాదు



ఆమదాలవలస రూరల్: రక్తదానం చేస్తున్న యువత

ఆమదాలవలస రూరల్: రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారికి ప్రాణాలను కాపాడాలని సత్యసాయి సేవా సంస్థల జిల్లా మెడికల్ ఇన్‌చార్జి తాతయ్యలు అన్నారు. మండలంలో అక్కులపేట గ్రామంలో గల సత్యసాయి సేవా సమితి మందిరంలో ప్రాణదాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ప్రమాదాలు, ఇతర కారణాల వలన రక్తం లేక చాలా మంది ప్రాణాలు కాపాడలేకపోతున్నారని, అటువంటి సమయంలో రక్త నిల్వలు ఉంటే ప్రాణాలు కాపాడటానికి వీలుకలుగుతుందన్నారు. రక్తదానం చేయడం వలన దాతలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు రావని, అన్ని పరీక్షలు నిర్వహించన తరువాతనే రక్తదానం చేసేందుకు అంగీకారం తెలుపుతారన్నారు. రక్తదానంపై చాలా మందికి లేనిపోని అపోహలు ఉన్నాయని, అటువంటి అపోహలు వీడాలని చైతన్యం కల్పించారు. 20 మంది యువకులు రక్తదానం చేయడంతో వారిని సత్యసాయి సేవా సమితి సభ్యులు అభినందించారు. న్యూబ్లెడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ హర్షవర్ధన్, మేనేజర్ టి.మణికంఠ, సత్యసాయి సమితి సూర్యారావు, జిల్లా విద్యాజ్యోతి ఇన్‌చార్జ్ జనార్దనరావు, జోనల్ యూత్ కో ఆర్డినేటర్ బి.సాయికృష్ణ, సమితి సభ్యులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: రక్తదానం చేయడంతో ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడవచ్చునని స్థానిక ఎస్‌ఐ కూటికుప్పల కృష్ణప్రసాదు తెలిపారు. జెమ్స్ ఆస్పత్రి (రాగోలు) వారి నేతృత్వంలో స్థానిక ఆర్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పలువురు యువతీయువకులు రక్తదానం చేశారు. ఫౌండేషన్ చైర్మన్ బాన్న భార్గవ, సభ్యులు పాల్గొన్నారు.

దైవ చింతన అవసరం

సారవకోట: ప్రజల్లో దైవ చింతర పెరగాలని లైదాం శివానంద ఆశ్రమ పీఠాధిపతి ప్రకాశనంద స్వామి అన్నారు. మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్యజీవన సమాజం ఆధ్వర్యంలో ఆదివారం ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. శివానంద స్వామి పాదుకులకు పూజ చేసి అనంతరం సత్సంగం నిర్వహించారు. భగవద్గీతలో మనం నిత్య జీవతంలో ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. అడవ గ్రామానికి చెందిన శివానంద ఆశ్రమ పీఠాధిపతి అరుణకుమార్, గున్నయ్య ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. జాడ మోహనరావు, మెండ సన్యాసిరావు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో సత్తా



ప్రవీణ్ కుమార్ పాణిగ్రహి

పాతపట్నం: ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష–2023 (6వ తరగతి ప్రవేశాలకు)లో పాతపట్నంకు చెందిన విద్యార్థి సత్తా చాటాడు. టీచర్స్ కాలనీకి చెందిన ప్రవీణ్ కుమార్ పాణిగ్రహి 300 మార్కులకు 278 మార్కులు సాధించాడు. సెయింటెన్స్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నారు. తండ్రి రామేచంద్ర పాణిగ్రహి ఉపాధ్యాయుడు, తల్లి పాతిమా గృహిణి. విద్యార్థికి కుటుంబ సభ్యులు అభినందించారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

పాతపట్నం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, అంబేడ్కర్ గురుకులం, ప్రభుత్వ మోడల్ స్కూల్‌తోపాటు మరో మూడు ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సుజాత తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించే ల్యాబ్ గదుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేశామని, ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్ గ్రూప్‌కు 78 మంది, వృత్తి విద్యాకోర్సుకు 47 మంది హాజరయ్యారని, ముగ్గురు గైర్హాజయ్యారని తెలిపారు.

'ప్రతిభ' పరీక్షకు విశేష స్పందన

పాతపట్నం: మండలంలోని రొంపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇండాస్ సంస్థ ఆధ్వర్యంలో నియోజవకర్గ స్థాయి ప్రతిభ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. 140 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సాంకేతిక విద్యను అలవర్చుకోవాలని హెచ్ఎం పి.వల్లభరావు అన్నారు. నియోజకవర్గంలోని 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించి, పదో తరగతి స్టడీ మెటిరియల్‌ను అందిస్తున్నారన్నారు. ప్రతిభ పరీక్ష ప్రశ్నపత్రాన్ని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, నిర్వాహకులు విడుదల చేశారు. ఇండాస్ సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ఆమదాలవలస: పట్టణంలోని మెట్టక్కివలసలో గల సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం 'ప్రేమ తొరవు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవా సమితి కన్వీనర్ కన్నేపల్లి వెంకట కామావధానులు, బాల వికాష్ గురువు ఆకెళ్ల రామలక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారులకు పౌష్టికాహారం అందించారు. జోనల్ కన్వీనర్ ఎం.రవీంద్రబాబు, సమన్వయకర్త కె.శేషగిరిశాస్త్రి, సీనియర్ భక్తులు వి.కృష్ణారావు, ఎం.మృత్యుంజయ శర్మ, జి.రమణ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: ప్రజలకు జవాబుదారీతనంగా ప్రభుత్వం ఉండాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని అడ్డపనస గ్రామంలోని కల్యాణ మండపంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. చంద్రబాబు లాంటి మోసకారిని, లోకేష్ లాంటి భవిష్యత్ లేని వక్తలను ప్రజలు నమ్మరన్నారు. గ్రామాల్లో ఏ సమస్య వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, సచివాలయ మండల కన్వీనర్ నక్క తులసీదాస్, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, సాగిపల్లి దండాశి, గద్దిబోయిన గోవిందరావు, పార్టీ నాయకులు వరుదు వంశీకృష్ణ, గెల్లంకి వెంకటరావు, కొండాల దేవేంద్ర, నిక్కు కృష్ణారావు, పల్లి కృష్ణారావు, రోణంకి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తూకం వేసి ఇవ్వాలి



గిడ్డంగి వద్ద ధర్నా చేస్తున్న రేషన్ డీలర్లు

నరసన్నపేట: రేషన్ బియ్యాన్ని గిడ్డంగుల వద్దే తూకం వేసి డీలర్లుకు అప్పగించాలని, పాత పద్ధతి ప్రకారం తూకం వేయకుండా ఇస్తే బియ్యం తీసుకు వెళ్లేది లేదని డీలర్లు తెలిపారు. స్థానిక సివిల్ సప్లయ్ గిడ్డంగి వద్ద నరసన్నపేట, పోలాకి మండలాలకు చెందిన డీలర్లు ఆదివారం ధర్నా చేశారు. ఒక్కో బస్తాలో 50 కేజీల 580 గ్రాముల బియ్యం ఉండాలని డీలర్లు సంఘం అధ్యక్షుడు ఊణ్ణ బాలభాస్కరరావు, ముద్దాడ జగం అన్నారు. బియ్యం తూకం వేయకుండా ఇవ్వడం వల్ల ప్రతీ బస్తాకు మూడు నుంచి ఐదు కేజీల బియ్యం తరుగు వస్తుందని, డీలర్లు నష్టపోతున్నారని ఆందోళన చెందారు. రేషన్ కార్డుల ప్రకారం ఎంత కోటా మంజూరైతే, ఆ మేరకు బియ్యాన్ని ఇవ్వాలని, ఒక్క కేజీ తక్కువ అయినా తీసుకునేది లేదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్, సివిల్ సప్లయ్ ఉన్నతాధికారులు తూకం వేసి ఇవ్వాలని ఆదేశిస్తున్నా.. గిడ్డంగుల వద్ద అలా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ మేరకు జిల్లా సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ధర్నా చేపట్టామన్నారు. డీలర్లు సంఘం ప్రతినిధులు సూర్యనారాయణ, అప్పన్న, లావణ్య, పంచిరెడ్డి రాజారావు తదితరులు పాల్గొన్నారు. గిడ్డంగి వద్ద డీటీ సైలజను ప్రశ్నించగా తూకం వేసి ఇస్తున్నామని, బస్తాకు 80 గ్రాములు తరుగువస్తుందని అన్నారు.

సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి



కృష్ణాపురంలో ప్రచారం చేస్తున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పార్టీ నాయకుడు చింతాడ రవికుమార్ పట్టభద్రల ఓటర్లును కోరారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి కృష్ణాపురం గ్రామంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి ప్రత్యేకించి లబ్ధి చేకూరేలా మన రాష్ట్ర రాజధాని విశాఖపట్నంలో ఏర్పాటుకు ప్రకటించారన్నారు. ఈ ప్రాంత యువతకు, ప్రజానీకానికి మేలు జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమృత ఆహారంతో ఆరోగ్య జీవనం

కొత్తూరు: అమృత ఆహారంతో ఆరోగ్యవంతమైన జీవనం గడపగలమని పార్వతీపురం పట్టణానికి చెందిన వైద్య నిపుణుడు రామ్మోహన్‌రావు తెలిపారు. కొత్తూరు మండల కేంద్రంలో అమృత ఆహారంపై వైస్ ఎంపీపీ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. అమృత ఆహారం తీసుకోవడంతో పొట్టలో ఉన్న బాక్టీరియాపై మూడు ప్రక్రియలు జరిగి వ్యాధులు రాకుండా నిరోధించవచ్చన్నారు. వివిధ రకాల ఆకులు, దుంపలు, పండ్లు, నవధాన్యాలు, చిరుధాన్యాలు ఉడకబెట్టకుండ పచ్చివి ముద్దగా చేస్తేనే అమృత ఆహారమన్నారు. అమృత ఆహారాన్ని తయారు చేసే విధానాన్ని వివరించి అందరి చేత తినిపించారు. కొత్తూరుకు చెందిన విశ్రాంత సివిల్ సర్జన్ పాలవలస శశిభూషణరావు, విశ్రాంత హెచ్‌ఎం గోపాలదాసు మాస్టార్, పాతపట్నం జెడ్పీటీసీ ఉషారాణి, వ్యవసాయశాఖ ఏడీ లింగాల మధుబాబు, కొత్తూరు మాజీ సర్పంచ్ ఎల్.తాతబాబు, వైద్యులు అచ్చెంనాయుడు, యుగంధర్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రెడ్డి శాంతిని కలిసిన నర్తు



ఎమ్మెల్యే రెడ్డి శాంతికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నర్తు రామారావు

ఎల్.ఎన్.పేట: పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతిని శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు పాలకొండలోని పాలవలస రాజశేఖరం స్వగృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎమ్మెల్సీ విక్రాంత్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు పాలవలస రాజశేఖరంను కూడా కలిసి ఈ నెల 28న శ్రీకాకుళంలో నిర్వహించనున్న పార్టీ కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రికలను అందజేశారు. వారిని కలిసిన వారిలో ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ఉన్నారు.

అపూర్వ సమ్మేళనం



సారవకోట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–92 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలిశారు. అనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. తాము చదువుకున్న పాఠశాలకు ఉపయోగపడేందుకు సౌండ్ మైక్, మధ్యాహ్న భోజన పథకానికి ఉపయోగించేందుకు వంద ప్లేట్లు అందజేశారు.

– సారవకోట